



అసుర సంధ్యవేళ.... ఆరుగంటలు దాటుతున్న సమయాన "రమణీ" అంటూ కేకేశాడు సుందర్రామయ్య. "నన్నుకాస్త వాకిట్లో వాలుకుర్చీలో కూర్చోబెడతావూ?"

రెండు పిలుపులు గాలిలో కలిసిపోయాక, మూడో పిలుపుకి వూడిపడింది రమణి. "కదలలేని మనిషి ఓ మూలగా పడుండక గడియకో కోరికా, గంటకో పురమాయింపూనూ! నాకొచ్చి పడుతోంది చావు మధ్యన!"

"అంటే, ఆ చావేదో నాకొచ్చి పడితే

సంతోషించేదానివా?"

"మీరు చావాలని నేనెందుకు కోరుకుంటానూ—నా పసుపు కుంకాలకి నేనే ఎసరు రావాలని కోరుకుంటానా? పెళ్ళొచ్చిపడ్డా ఇంగితం లేకపోయాక ఏం లాభం?" సణుగుతూనే అతని చేతులు పట్టుకుని ముందు వరండాలోకి నడిపించుకు వెళ్ళింది రమణి.

"ఇవాళ నన్ను తిట్టుకుని ఏం లాభం? పెళ్ళినాడే వుండాల్సింది ఇంగితం. ముసిలి మొగుడితో కాపురం నల్లేరుమీద బండినడక అనుకుని ఒప్పుకున్నావా? అవాళ మీనాన్న పెళ్ళి చేయలేక ఏడుస్తుంటే, ఎవరో ఒకరు దొరికిందే చాలనుకున్నావ్—ఇవాళ సణుక్కుని ఏం లాభం?"

వాలుకుర్చీలో కూలబడి అన్నాడు సుందర్రామయ్య.

భర్తకి జవాబు చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయింది రమణి.

ఆకాశం వైపు చూస్తూ పడుకున్నాడు సుందర్రామయ్య. అతడి మనసులో కావాల్సివున్న కూతురి పెళ్ళి మెదుల్తోంది.

వయసులో వుండగా చేసిన తప్పుల్ని నెమరువేసుకునేందుకు, పశ్చాత్తాప పడేందుకూ భగంతుడిచ్చే అవకాశ వ్యవధానమే వార్ధక్యం.

వార్ధక్యపు తొలిరోజుల్లోకి అడుగుపెడుతున్న సుందర్రామయ్య రెండోపెళ్ళి చేసుకున్నందుకు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాడు.

కానీ పశ్చాత్తాపం అన్ని పాపాలకీ పరిహారంకాదు.

సుందర్రామయ్యకి పెద్దకూతురి పెళ్ళి చూపులు గుర్తుకొచ్చాయి.

కుర్రాడికి(?) ముప్పై అయిదేళ్ళుంటాయి, ఏదో ప్రైవేటు కంపెనీలో అటెండర్‌గా పని చేస్తున్నాడు, మెట్రిక్ పాస య్యాడట. మనిషి బుద్ధిమంతుడనే తెలిసింది. ముప్ఫయేళ్ళు వస్తున్న కూతురికి యింతకన్నా ఘనమైన సంబంధం తేగలననే ఆశ సుందర్రామయ్యకి లేదు. ఆ కుర్రాడు మంచివాడు. కట్నం కింద వెయ్యినూట పదహార్లు యిస్తే చాలన్నాడు. కానీ, పెళ్ళి మాత్రం వూరికే అయిపోదుగా. కనీసం నాలుగు వేలన్నా ఖర్చవుతుంది. అంటే, మొత్తం అయిదు వేలన్నా వుండాలి. ఎలా వస్తాయి?

ఎలా వస్తాయో ఆలోచించకుండానే వాళ్ళకి మాట యిచ్చేసి- తాంబూలాలు పుచ్చేసుకున్నాడు సుందర్రామయ్య-ఇప్పుడతని ధైర్యం ఒక్కటే-

'ఈ పెంకుటిల్లు ఎలాగూ పదివేల తన ఖాతాలో వుంది, దాన్ని పూర్తిగా అమ్మేస్తే మరో అయిదారువేలు రాకపోవు. దాంతో కూతురి పెళ్ళి జరిపేస్తే ఓ బాధ్యత తీరిపోతుంది-వున్న ఒక్క ఎకరం పంటాతింటూ కొడుకు పంచన తలదాచుకోవచ్చు. తన బాధ్యత, కుటుంబ భారం ఇహ కొడుకే చూసుకుంటాడు.'

ఆకాశం రూపుమారుతున్న మబ్బుల్లో కూతురి పెళ్ళి దృశ్యాలు కనబడుతున్నాయతనికి.

o o o

ఆరుగంటలు దాటుతున్న అసురసంధ్య సమయాన సంధ్యతో కలిసి ఆ పార్కులోకి ప్రవేశించాడు చక్రవర్తి. ఇద్దరూ వెళ్ళి ఓ పొదచాటుగా కూర్చున్నారు.

"సో, మీ అక్కయ్యకి సంబంధం కుదిరిందన్నమాట."


"యస్. ఇంక సెటిల్ కావలసిందల్లా మన సంబంధమే."

"అది ఎప్పుడో సెటిలపోయింది."

"అని మనకి తెల్సు. అధికారికంగా అందరికీ తెలియజెప్పాలిగా!"

"అవును చక్రీ, మరా పని ఎప్పుడు చేస్తావ్ ?"

"ఇన్నాళ్ళూ అక్కయ్య సంగతి తేలాలనే ఆగాను. ఇప్పుడింక అది తేలిపోయిందిగా. అక్కయ్య పెళ్ళికాగానే చెప్పేస్తాను మా నాన్నతో మన సంగతి,"




"మీ నాన్నగారు వప్పుకోవచ్చు, మరి మీ పిన్ని ?"

"హెల్ విత్ హర్ ! ఆవిడ యిష్టాయిష్టాలెవడిక్కావాలి ? నేనిప్పుడు ఆ యింటికి యజమానిని- తెల్సా! మా నాన్న మంచానపడ్డనాడె ఆవిడ పవర్సన్నీ పోయాయి. నేను ఉద్యోగం సంపాదించగానే ఆ పవర్సన్నీ నాకొచ్చేశాయి. కనక ఇప్పుడు మా పిన్ని అనబడే ఆ పిశాచి నేను చెప్పినట్టు వినాలి - మా నాన్న సంపాదించి పెట్టినన్నాళ్ళూ దానిష్టం వచ్చినట్టు అది ఆడించింది నన్నూ-అక్కనీ. ఇప్పుడు సంపాదన మనది. కనుక మనం ఆడించే అవకాశం వచ్చింది, అండర్ స్టాండ్ ?"

"అర్థమైంది, కానీ మీ యింటి రాజకీయాలు చూస్తుంటే నాకు మతిపోతోంది, ఎలా నెగ్గుకురావాలో అని భయంగావుంది."

"డోంట్ వర్రీ, పెళ్లి కాకముందే కాపురం గురించి ఎందుకుభయపడతావ్ ! నేను నీ పక్కనుండగా నీమీద ఈగవాలదు! చక్రవర్తి భార్య అంటే ఏమిటనుకున్నావ్ ? మహారాణి అన్నమాట !"

సంధ్య నవ్వింది పల్చగా. చీకట్లు పడుతుండటంతో చక్రవర్తి నెమ్మదిగా ఆమె ఒళ్ళోకి తలవాల్చిపడుకున్నాడు.

○ ○ ○

ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పాడు సుందర్రామయ్య కొడుకుతో. "పై నెల్లో జరిగిపోవాలి పెళ్ళి. ఆ తర్వాత మూణ్ణెల్ల దాకా ముహూర్తాల్లేవుట!"

"అయితే యింకేం—పెట్టించెయ్యండి ముహూర్తం." అన్నాడు చక్రవర్తి.

"ముహూర్తం మధ్యాహ్నమే పెట్టించాను. పురోహితుడొచ్చాడు మధ్యాహ్నం. పై నెల ఇరవై అయిదవతేదీ పెళ్ళి."

"అంటే సరిగ్గా యాభై రోజులుంది యింకా." లెక్కవేసి అన్నాడు చక్రవర్తి. "యీ లోగా మనం ఏర్పాట్లన్నీ....ఐ మీన్-డబ్బూ అదీ చూసుకోగలమా?"

"అదే నా ఆలోచన కూడా! మీ ఆఫీసులో ఏమన్నా.. లోన్...దొరుకుతుందా? నాకు ఏదయినా చెప్పొచ్చులే...." సుందర్రామయ్య అన్నాడు.

"మా ఆఫీసులోనా?", నవ్వాడు చక్రవర్తి, "మరీ అంత స్పీడ్ పోకండి నాన్నా, నేను చేరి ఏడాదే కదా అయింది! నాకు

లోన్ ఎవరిస్తారు ఏ సాకుతోనైనా? ప్రావిడెంట్ ఫండ్‌లో ఏదయినా జతపడితే, అప్పుడేమనం అందులోంచి అప్పు తీసుకునేందుకు వీలు." వివరించాడు తండ్రికి. నిరాశగా చూసాడు సుందర్రామయ్య.

"అంతేనంటావా!"

"అంతే నంటావా?"

"అయినా మీకు అప్పు గురించి ఎందుకండీ ఆలోచన? ముందు మన చక్రవర్తికి పెళ్ళి చేసేస్తే సరిపోతుందిగా! ఆ కట్నం డబ్బుతో అమ్మాయి పెళ్ళి చేసెయ్యొచ్చు" మధ్యలో కల్పించుకొంటూ అంది రమణి.

"నీ సలహా చాలా బాగుంది పిన్నీ, కానీ అది సాధ్యంకాని పని."

"ఏం? ఎంచేత?" రోషంగా అడిగిందామె.

"ఎంచేతంటే, నా పెళ్ళి ఆల్‌రెడీ ఓ అమ్మాయితో కుదిరిపోయింది గనక. ఆ అమ్మాయినుంచి నేను కట్నం తీసుకోబోవటంలేదు గనక."

"ఆఁ...." నోరు తెరిచారు సుందర్రామయ్య, రమణీ....

"అవును నాన్నగారూ, నేను నెమ్మదిగా చెప్పాలనుకున్నాను. ఇప్పుడిలా అవసరం తోసుకు వచ్చింది. అందుకే చెప్పేశాను. ఆమె క్రిందటేడాది నాతోపాటూ అదే ఇన్‌స్టిట్యూట్‌లో టైపు నేర్చుకుంది. అక్కడే పరిచయం. మనవాళ్ళే! ఆమెకి తల్లిదండ్రులు లేరు. అన్నయ్య, వదినల దగ్గర వుంటోంది. అందుకే నేను కట్నం ఏమీ తీసుకోదల్చుకోలేదు. వాళ్ళూ ఏమీ వున్నవాళ్ళు కారు."

"ఆహా! ఆదర్శం కాబోలు- తిండికి రికాణా లేకపోయినా, ఆదర్శాలకి లోటు లేదు ..." అక్కసుగా అంది రమణి.

"నోర్ముయ్....ఎవరికి తిండికి రికాణా లేదూ? నెలకి అయిదొందలు సంపాదిస్తున్నాను. నాకేం లోటులేదు. అయితే గియితే నీకే వుండాలి...."

"ఏమిట్రా ఆ వాగుడు? పిన్నిమీద అలాగేనా అరిచేది?" కల్పించుకున్నాడు సుందర్రామయ్య.

"ఆహాఁ...పిన్నిని అనేసరికి చటుక్కున వెనకేసుకు వస్తున్నారు—మరి ఆవిడగారు నన్ను అన్నప్పుడు మీకు చీమ కుట్టలేదేం?" తండ్రి మీదకు వెళ్ళాడు చక్రవర్తి.

"నేను దాన్ని ఏమన్నా అనేదాకా నువ్వు ఆగావా?"

"సరే—ఆవిడ అన్నదానికి నేను జవాబు చెప్పాను. సరిపోయిందిగా!"

"ఛీ....ఇది యిల్లు కాదు – నరకం" విసురుగా అంటూ కంచం ముందునుంచి లేచి బయటకు పోబోయాడు. గోడ ఆసరాతో, సుందర్రామయ్య.

ఆయన్ని వదల్లేదు వాళ్ళిద్దరూ.

"విన్నారుగా మా అబ్బాయి ఆదర్శం? మరి కూతురి పెళ్ళికి ఏం ఏర్పాటు చూసుకుంటున్నారు?" నిలేసింది రమణి.

"నాన్నని రెచ్చకొట్టకు పిన్నీ...." అందామనుకుంది అంతా మౌనంగా, బాధగా చూస్తున్న సుమతి. కానీ ఆ ధోరణి తనమీదికి తిరుగుతుందని భయపడి వూరుకుంది. తమ్ముడికి చెప్పినా లాభం వుండదని ఆమెకి బాగా తెలుసు. నిద్రపోతున్న నాలుగేళ్ళ సవతిచెల్లెలి పక్కమీద తనూ కూర్చుండిపోయింది-వాళ్ళగొడవకి వాళ్ళని వదిలి.

"పెళ్ళంటూ తలపెట్టాక, వీడు అప్పు తేలేదని ఆగిపోతానేమిటి? ఈ యిల్లు కాస్తా అమ్మిపారేస్తే, పెళ్ళిఖర్చులు రాకపోవు" రోషంగా జవాబిచ్చాడు సుందర్రామయ్య.

"ఆఁ....ఆఁ... మీరదే ఆలోచన్లో వుంటారని నాకు తెల్సు. కొడుక్కి చదువు చెప్పించి, ఉద్యోగం వేయించుకున్నారు ఇహ యీ యిల్లు అమ్మి కూతురికి పెళ్ళి చేసుకోండి. ఆ తర్వాత నేనూ, నా కూతురూ వాళ్ళ యిళ్ళలో వూడిగాలు చేసుకు బతుకుతాం."

"ఛీ నోర్ముయ్....... శని మాటలూ నువ్వూనూ! చెట్టంత కొడుకు సంపాదిస్తురడగా నువ్వు వూడిగాలు చేయాల్సిన అవసం

మేమిటి ?" సమర్థించ బోయాడు సుందర్రామయ్య.

"మీరే సమర్థించాలి యింక! దాయాదుల సోదరప్రేమా, సవతి కొడుకు తల్లి ప్రేమా నమ్మ దగ్గవే! హుఁ.... ఇవాళే నోర్మూయ్యమన్న దరిద్రుడు రేపు నన్నూ, నా కూతుర్నీ చూస్తాడా...."

"అదిగో మళ్ళీ! నేను దరిద్రుణ్ణెందుకవుతాను? వస్తే నీకే వస్తుంది దరిద్రం. ఇంకొక్క మాట జారావంటే మర్యాద మిగల్దు...." అంటూ రమణిమీదికి వెళ్లాడు చక్రవర్తి.

"విన్నారా? విన్నారా? మర్యాద మిగల్దుట...." అంటే? ఏం చేస్తాడు? ఇప్పుడు మర్యాద నిలిపినట్టు మాట్లాడుతున్నాడు మహా! ఛీ.... ఈ దశకి వచ్చింది నా బతుకు...." రుద్ధ కంఠంతో అరిచింది.

"ఒరేయ్ చక్రి, నువ్వు నోరుమూస్తావా? నన్ను ఎందులోనన్నా పడి చావమంటావా?" తండ్రి పెట్టిన కేకతో చక్రవర్తి కాస్త తగ్గి, గబగబ చొక్కా తొడుక్కుని వీధిలోకి వెళ్ళిపోయాడు. రమణి దొడ్లోకి వెళ్ళి, అంట్ల గిన్నెలమీద తన కోపమంతా ప్రదర్శించ సాగింది.

o o o o

రెండ్రోజులు గడిచాయి. భోజనం వేళకి యింటికి రావటం, వెంటనే వెళ్ళి పోవటం మళ్ళీ ఏ రాత్రికో ఇంటికివచ్చి పడుకోవటం తప్ప మిగతా వేళంతా బయటే గడుపుతున్నాడు చక్రవర్తి - ఇంట్లో ఎవర్తోనూ మాటగా కూడా లేవు.

రమణి హృదయం కోపంతో ఉడికిపోతోంది.

'వీడు నెమ్మదిగా యింటి బాధ్యతనుంచి తప్పుకుపోతాడింక. ఆ అమ్మాయి నెవర్నో చేసుకు వేరు కాపురం పెట్టేస్తాడు. తర్వాత తమ గతి ఏమిటి? అవిటి మొగుడితో, నాలుగేళ్ళ పసివాడితో తను ఏ పాట్లుపడనుంది? ఈ యిల్లు కూడా అమ్మేసి సుమతి పెళ్ళిచేసి పంపేస్తాడు తన మొగుడు. వుండటానికి గూడు కూడా లేకుండా తాము ఏ చెట్ల కింద చేరనున్నారు?

ఇదంతా సాగటానికి వీల్లేదు. తను ఏదో ఒకటి చెయ్యాలి...."

తీవ్రంగా ఆలోచిస్తున్న రమణికి నెల రోజుల క్రితం జీతాలనాడు చక్రవర్తి సుందర్రామయ్యతో చెప్పిన మాటలు గుర్తుకి వచ్చాయి.

"పది రూపాయలు తక్కువ వచ్చాయేం?" అని అడిగాడు సుందర్రామయ్య. కొడుకు తెచ్చి యిచ్చిన జీతం అందుకుంటూ,

"మా ఆఫీస్‌లో ఈ నెలనించీ ఓ క్రొత్త స్కీం అమలులోకి వచ్చింది. మొత్తం పదిహేను వందలమంది ఉద్యోగులు వున్నాం. ఒకొక్కరూ పది రూపాయలు చొప్పున మొత్తం పదిహేను వేలు...."

చక్రవర్తి వివరిస్తుండగా విని రమణి అప్పుడు మాత్రం పనీపాటా లేని దేశోద్ధరణ- అని విసుక్కుంది. అదీ యిప్పుడామెకి కల్పతరువులా అనిపిస్తోంది.

ఒక్కసారి ఆమె మనసు ద్వంద్వ భావాలతో అతలాకుతలమై పోయింది.

"ఆ పని తను చెయ్యగలదా?"


"ఏం చేస్తే? వాడెలాగూ ఇహ యీ యింటి మొహం చూడడు. చేయి జారి పోకముందే తన ఆలోచనని అమలు జరిపేస్తే, యీ యిల్లు తమకి మిగుల్తుంది. సుమతి అత్తవారింటికి వెళ్ళిపోతుంది. పొలంమీద వచ్చే నాలుగు గింజల్తో తమ కాలం జరిగిపోతూ వుంటుంది."

రానురాను తన ఆలోచన సరయినదిగానే తోచింది రమణికి. ఆమె కళ్ళముందు పదిహేనువేలు నర్తించటం మొదలెట్టాయి. పథకం ఆలోచించసాగింది తీవ్రంగా.

o o o

"అనటమయితే అనేశానుగానీ — మా అక్క మొహం చూస్తే జాలి వేస్తోంది సంధ్యా!"

"అవును మరి. నీకయితే ఓ అవుట్ లెట్




అంటూ ఏర్పడిందిగానీ, ఆమెకి పెళ్ళయితే తప్ప ఆ యిల్లు, మీపిన్ని పేర వదిలే దారి లేదుగా!"

"మంచి అవకాశం. ఈ సంబంధం అయిపోతే అక్కయ్య సుఖపడుతుంది. లేకపోతే మరో సంబంధం యింత చవకలో కుదరటం కష్టం...."

"నీకు ఎక్కువ తొందరగా వున్నట్టుందే మీ అక్కకన్నా?" చిలిపిగా అంది సంధ్య.

"అవును నీ నుంచి వచ్చిన అలవాటే ఆ తొందర." నవ్వాడు చక్రవర్తి.

ఆ ఫామిలీ రూం'లో వాళ్ళిద్దరే వున్నారు. సర్వర్ వచ్చి, వాళ్లు కబుర్లు నంచుకుంటుండటం చూసి వెళ్ళిపోయాడు.

"ప్రాబ్లం యీజ్ సీరియస్. ఏం చెయ్యాలో తెలియట్లేదు"

"నేనో సలహా యివ్వనా?" అడిగింది సంధ్య.

"ఊc ..."

" మా అన్నయ్యని అడుగు డబ్బు సర్దగలడేమో—రెండు, మూడు వేలనాదా"

"ఛ....కట్నం అడుగుతున్నా ననుకుంటాడు."

"అలా ఎందుకనుకుంటాడు? నేను ఉద్యోగంకోసం ప్రయత్నిస్తూనే వున్నానుగా. నెమ్మదిగా తీర్చేద్దాం—అది అప్పు అనుకుని!"

రెండు నిమిషాలు ఆలోచించాడు చక్రవర్తి.

"మరి యింకా రెండువేలన్నా కావల్సి రావచ్చు... "

"నా గొలుసు, గాజులు అమ్మేద్దాం"

"సంధ్యా...." బాధగా అరిచాడు చక్రవర్తి. వెంటనే సిగ్గుపడి, తలుపువంక చూశాడు. సర్వర్ వచ్చాడు.

"రెండు దోసె....ఆనియన్" చెప్పాడు చక్రవర్తి-గొంతు సర్దుకుని. సర్వర్ వెళ్ళిపోయాడు.

"ఇంకా పెళ్ళికూడా కాలేదు. నేను చేయించవల్సింది పోయి, నీ నగలు అమ్ముకురానా?"

"డోంట్ బి సెంటిమెంటల్ చక్రీ—

అవసరం అలాంటిది. పోనీ, మా అన్నయ్య అప్పు తీరేక, నా జీతం మిగుల్తుందిగా- దాంతో నా అప్పు తీర్చేయ్...."

"నవ్వులాట కాదు"

"అవును. నవ్వులాట కాదు. మనకి వెంటనే పెళ్ళి కావటం కూడా ముఖ్యమే. అందుకోసం అన్నయ్యదగ్గర అప్పుచేసినా తప్పులేదు. అదీ ఓ మంచి పనికోసం."

ఉల్లిదోశలు రావటంతో మాటలు ఆపింది సంధ్య.

సర్వరు నిష్క్రమించగానే ఓ ముక్క తుంపి చక్రవర్తి నోటికి అందించింది.

కాఫీలు తాగి బయటకు రాగానే అన్నాడు చక్రవర్తి-

"నాకు చాలా సంతోషంగా వుంది యిప్పుడు-నీ సహాయంతో అక్కపెళ్ళి జరిగి పోతుందనిపిస్తే! నాన్న ఆ యిల్లు అమ్మే అవసరం లేదని తల్చుకుంటే...."

"ఇల్లు అమ్మటం ఏమాత్రం మంచి పని కాదు. ఈ రోజుల్లో మనలాటివాళ్ళకి ఇల్లు కట్టుకోవటం అంత తేలికపని కాదు. స్థలాలే కొనలేకుండా ఉన్నాం. ఉన్న యిల్లు పోగొట్టుకుంటే, తర్వాత పశ్చాత్తాప పడవల్సి వస్తుంది" సంధ్య అంది.

"అయామ్ లక్కీ"

"ఏం"

"నిన్ను భార్యగా పొందుతున్నందుకు. ఓకే....యివాళ మనం ఏదన్నా పిక్చర్ కి వెళ్దాం. సైముంది ఫస్టుషోకి"

"ఇంట్లో చెప్పలేదు,"

"ఇద్దరం కలిసే వెళ్ళామని తెల్సుగా! నేను నిన్ను దింపి వెళ్తాలే - సినిమా అయిన తర్వాత !"

"దగ్గర్లోవున్న థియేటర్లో పాత సినిమా ఆడుతోంది. బాబీ !"

సినిమా కాగానే రిక్షాలో సంధ్యని దింపి, యిల్లు చేరుకున్నాడు చక్రవర్తి.

సుందర్రామయ్య నిద్రపోతున్నాడు. వెంటనే లేపి, అక్కయ్య పెళ్ళికి డబ్బు సర్దుతానని చెప్పాలని పించింది అతనికి. ఉత్సాహం ఆపుకున్నాడు.

రమణి ఏదో పత్రిక చదువుతూ యింకా మేలుకునే వుంది. ఆమెతో చెప్పాలనిపించింది. చెప్పబుద్ధి కాలేదు. మౌనంగా వంటింట్లోకి నడిచాడు. కంచం పెట్టుకోగానే వచ్చింది రమణి.

"నేను వడ్డిస్తాను."

"ఏం యివాళ అంత దయ?" వ్యంగ్యంగా అన్నాడు.

"వడ్డించ కూడదా ?"

"అక్కర్లేదు."

రమణి చిన్నబుచ్చుకొని వంట గది లోంచి వచ్చేసింది. చక్రవర్తి తనే వడ్డించుకుని భోజనం ముగించాడు.

లేచి తన గదిలోకి నడిచాడు. రమణి వంటగదిలోకి వెళ్ళి, కంచం తీసేసి, ఖాళీ అయిన గిన్నెలవంక తృప్తిగా చూసి మోరిలో పడేసింది వాటన్నిటినీ.

పక్కమీద వాలిన చక్రవర్తి ఆలోచనల్తో కొంతసేపు గడిపి కళ్ళు మూసుకున్నాడు.

o o o

తెల్లగా తెల్లవారి, ఏడు గంటలవుతున్నా చక్రవర్తికి మెళుకువ రాలేదు. అతడిని లేపుదామని వెళ్ళిన సుమతి రెండు సార్లు పిలిచి, భుజాలు పట్టి కుదిపి అతడు పిలుపు కందనంత దూరం వెళ్ళిపోయేడని గ్రహించి "చక్రీ" అంటూ భూమి దద్దరిల్లేలా కేక పెట్టింది.

"ఏమయిందమ్మా" అంటూ యీడ్చుకుంటూ వచ్చాడు సుందర్రామయ్య-అతని వెనకే రమణి,

విషయం క్షణాల మీద వీధంతా పాకి పోయింది. ఆఫీసుకికూడా వార్త పాకి పోయింది.

"ఏమయింది? ఎలా పోయాడు?" అంటూ అడుగుతున్నారు అందరూ

"రాత్రి రాగానే గుండెనొప్పిగా వుందన్నాడండీ - డాక్టర్ని పిలిపిస్తానన్నాను. ఫర్లేదు—ఏవో మాత్రలు వేసుకుంటున్నానన్నాడు. వేసుకుని పడుకుంటే, తగ్గిపోయిందనుకున్నాను... తెల్లారేసరికి.. " రమణి వివరిస్తోంది — మధ్యమధ్య కన్నీళ్లు కారుస్తూ-అందరికీ!!

మధ్యాహ్నం వేళకి, ఆఫీసునుంచి మనుషులు వచ్చారు. వాళ్లనిచూడగానే రమణి కళ్లు మెరిశాయి.

సుందర్రామయ్యగారి పక్కన కూలఒడ్డారు వాళ్ళు.

"నిన్న కూడా ఆఫీసుకి వచ్చిన మిత్రుడు . యివాళ మాయమైపోతాడనుకోలేదు మేం!.. ."

"మీకు తెల్సేవుంటుంది. మా ఆఫీసులో కొత్తగా స్కీం ప్రారంభించాము. ఇలాటి అన్యాయం సంభవించిన కుటుంబాన్ని ఆదుకునేందుకే ఒకొక్కరం పది రూపాయలు వేసుకుని పదిహేనువేలు ఆ కుటుంబానికిస్తాం. ముందుగా యీ వెయ్యి వుంచండి. మిగతాది వారం, పది రోజుల్లో వస్తుంది.

వెధవడబ్బు మనిషిని బతికించలేదుగానీ-డబ్బులేందే ఏ మనిషీ బతకలేడుకదా!"

○ ○ ○

పాము కాటు వేస్తుంది. ఆ కాటు గుర్తులు శరీరంమీద కనబడేలా స్పష్టంగా వేస్తుంది! పాముకాటుకి విరుగుడూ వుంది.

మనిషీ కాటు వేస్తాడు. కానీ ఆ కాటు గుర్తులు తెలియకుండా జాగ్రత్తపడే తెలివితేటలు అతనికున్నాయి! మనిషి కాటుకి విరుగుడు లేదు!!

